# ఆదూరి వెంకట సీతారామమూర్తి

## ఇంతేలే....కథలింతేలే....

"కొం

మునిగింది గురూగారూ"

కెమెరా బాయ్ కైలాసం కేకకి వెనక్కి తిరిగి చూశాడు ఆంధ్రుల అభిమాన సినీ దర్శకుడు దండాల సామి.

"ఏమైందిరా?" అన్నాడు నిబ్బరంగా.

"ఏమైందేటంటారేటి బాబూ. నారాయణ బాబు సినిమా 'జడ్జి మొగుడు' కథా మనం తీసే సినిమా కథా ఒకటేనండి" అన్నాడు వగరుస్తూ.

"ఎవరు చెప్పేర్రా నీకూ" తాపీగానే పైపులోంచి పొగవదులుతూ అడిగేడు దండాలసామి.


'ఎవరో చెప్పడమేటండి... ఇదిగో... ఈ పత్రికలో ఏసినారు" అంటూ ఓ తాజా సినీపత్రికని అతని చేతి కందించాడు కైలాసం.

ఒక్క క్షణం అందులోని వార్తనీ, దానితోపాటు ప్రచురించిన కథనీ చదివేడు దండాలసామి.

"పెతి రైటరూ డైరెక్టరైపోయి సినీమాలు తీసేదానికి తయారెతూంటే ఇలాగే ఉంటాది. ఆస్టోరీ ఆడి బాబుగాడి సొమ్మనుకున్నాడు గాబోలు! ఆ బొమ్మెలా రిలీజౌద్దో మనమూ సూద్దాం. ముందు మన కథా రచయితకి కబురెట్టు... ఆదోపనే మన పెకాశాన్నీ కేకెయ్" అంటూ ఆజ్ఞలు జారీ చేశాడు.

మరుక్షణంలో అసోసియేట్ డైరక్టరు ప్రకాశం అతని ముందు ప్రత్యక్షమయ్యాడు. అతగాడు సంగతంతా విని.

"బలేవోరండి... మన రచయితగారు మాత్రం ఏం చేయగ్గలండి? మనం చెప్పిన పాయింటుకేగదా ఆయన స్టోరీ అల్లిందీ? ఆ తర్వాత మనమంతా కూర్చుని మార్చేశామాయె... చార్జీలు తప్పితే అడ్వాన్సు కూడా ఇయ్యలేదాయనకి. అడగడం బాగుండ దేమో"




అంటు తన సందేహాన్ని వ్యక్త పరచేడు.


"మరైతే అవతలోడికి మన కథెలా వెళ్ళింది?" అంటూ ప్రశ్నించాడు దండాలసామి అసహనంగానే.

అక్కడున్న ఎవరూ ఏం మాట్లాడలేదు.

"సరే ఎలాగెళ్ళిందో తర్వాత కనుక్కుంటాగాని ముందా నారాయణ బాబు దగ్గరకెళ్ళి ఆ సినిమా ఆపేమని చెప్పు లేకపోతే కథేనా మార్చుకోమను... పెద్దకబుర్లాడితే కోర్టుకీడ్చేస్తామని చెప్పు. ఆళ్ళకంటె ముందు ఆ కథ తయారు చేసుకొంది మనం... మినిష్టర్ చేత సినిమాకి ముందుగా క్లాపు కొట్టించింది మనం... అంచేత ఆపీకపోతే కొంపలు ముంచేస్తామని చెప్పు."

దండాలసామి మాటలకి తలూపినా; అవేమాటలు అవతలి వాడితో ఎలా చెప్పాలా అని సందిగ్ధంలో పడిపోయాడు ప్రకాశం.

దండాలసామికి ఫిలిం ఫీల్డులో మంచి పేరుంది కొంత మందికి భక్తి, మరి కొంతమందికి భయమూ ఉన్నాయి ఆయనంటే. దండాలసామి అసలు పేరు కె. దామోదర స్వామి. ఫీల్డులోకి రాకముందు అతన్నంతా కె.డి. స్వామి అనేవారు. అతను సినీ ప్రపరిశ్రమలోకి మొదట చిన్న హోదాలోనే జేరేడు. అందరిపట్లా వినయ విధేయతలతో ఉండేవాడు. రోజు మొత్తంమీద ఎవరెన్ని సార్లు కన్పించినా అన్ని మార్లూ అందరికీ దండాలు పెడుతూనే ఉండేవాడు. ఇటు ఫ్లోర్ అసిస్టెంట్ దగ్గర్నించి దర్శకుడి వరకూ, అటు ఎక్స్ట్రా ఏక్టర్ నుండి హీరో హీరోయిన్ల వరకూ



ఎవరెక్కడ కన్పించినా దండాలు పెడుతూనే ఉండేవాడు. అందుకే అతన్నంతా 'దండాలసామి' అనేవారు ముద్దుగా... అతనికి ఆ పేరే బాగుందని పించి అదే ఖాయ పర్చుకున్నాడు... స్వశక్తితో కొంతా కె.డీ బుద్ధితో మరికొంతా పెరిగి అంచెలంచెలుగా సినీ దర్శకుడై రాటుదేలి పోయేడు.

"ఏటింకా ఇక్కడే నిలబడిపోయేవ్. ఆడ బొమ్మ రిలీజ్జేసే దాకా కదలవేటి" అనేసర్కి అక్కణ్ణించి పరుగెత్తేడు ప్రకాశం.

ప్రకాశం వెళ్ళే సర్కి తన గదిలో ఫోంకుర్చీలో కూర్చుని వీడియోలో ఇంగ్లీషు సినిమా కేసెట్ పెట్టుకుని చూస్తున్నాడు నారాయణ బాబు.


గోద్రెజ్ కుర్చీతెప్పించి కూర్చోమని కప్పు టీ ఇచ్చి మర్యాద చేసేడు... పదేళ్ళ క్రితం అతను ఒక గదిలో అద్దెకున్నప్పటి నుంచీ ప్రకాశానికి తెల్సు... ఒక మడత మంచం, ఒక స్టవ్, ఓ ట్రంకు పెట్టె, ఓ ట్రాన్సిస్టరూ... ఇవే అప్పటి అతని ఆస్తులు... నారాయణ బాబు కథారచయితగా సినీ ఫీల్డులోకి అడుగు పెట్టేడు... మొదట్లో అతని కథలు విన్న నిర్మాతలూ, దర్శకులూ బావుందనేసి వెళ్ళిపోయేవారు... మరికొందరు ఏదో పాతికో ఇచ్చి కొనేవారు... కొందరు కథ విని, సినిమాకి పనికిరాదంటూనే తర్వాత అదే కథని తమ స్వంతం చేసుకుని సినిమాలు తీసేవారు.



'మేడ్ ఫర్ ఈచ్ అదర్''

హార్వే అనే 3 అడుగుల 7 అంగుళాల సర్కస్ బఫూన్ అమెరికన్ టీ.వి ప్రేక్షకులకు ప్రియమైన హీరోయే కాదు, 5 అడుగుల 7 అంగుళాల ఎర్రని జుట్టు, శరీరఛాయ గల టోరీ టాలెన్‌కి అతి ప్రియమైన భర్త కూడా.

వీరిద్దరికీ 'ఎక్కడా' తేడా లుండవని ముక్త కంఠంతో చెబుతున్నారు.




అయితే నారాయణ బాబు దగ్గర ఎంతో కొంత డబ్బు ఇచ్చి కథకొన్నా వాళ్ళంతా బాగుపడ్డారు... ఆ సినిమా కనీస పక్షం వాలుగు వారాలేనా ఆడేది. అతనికి అన్యాయం చేసే వాళ్ళు మాత్రం మట్టిగొట్టుకు పోయేవారు...

ఈ నిజాన్ని గ్రహించిన వారంతా తర్వాత్తర్వాత అతనికి డబ్బు అడ్వాన్సు ఇచ్చి మరీ కథలు రాయించుకునేవారు. అలా కొన్నాళ్ళకి 'నాకు మాటలు రాసే ఛాన్సు ఇస్తే గాని కథయివ్వను'' అనే స్థితి కొచ్చాడు నారాయణ బాబు. అలా సినీపరిశ్రమలో ఎదిగాడు... ఇప్పుడతనికి మంచి గుర్తింపు ఉంది... డబ్బు ఉంది. ఈ మధ్యే రెండు సినిమాలకి దర్శకత్వం కూడా చేసేడు... ఇప్పుడు తీస్తున్న 'జడ్జి మొగుడు'' మూడో సినిమా...

దండాలసామి చెప్పమన్న విషయాన్ని నెమ్మదిగా జంకుతూనే నారాయణ బాబుకి చెప్పేడు ప్రకాశం. అంతావిని, సినిమాలో విలన్‌లు నవ్వే నవ్వులాంటి ఓ పెద్ద నవ్వొకటి నవ్వేడు నారాయణ బాబు.

"కోర్టు కెళ్ళే ధైర్యంకూడా ఉందా మీ దండాల సామికి? అయినా, డైరెక్టరయిన ప్రతివాడూ ఇలా కథలూ మాటలూ రాసేసు కుంటున్నాం అని జబ్బలు చరుచుకుంటే ఇలాగే ఉంటుంది మరి. మీ "చవట మొగుడు... మొరటు పెళ్ళాం'' కథ అతగాని సొంత కథ అనుకుంటున్నాడు కాబోలు. రమ్మను కోర్టుకి'' అన్నాడు ఛాలెంజ్ చేసే ధోరణిలో.

ప్రకాశానికి ఏం చేయాలో తోచలేదు. రెండు పొట్లగిత్తల మధ్య చిక్కుకున్న కుందేల్లా ఉండి పోయాడు ఒక్క క్షణం.

"నీకు ఇంగ్లీషు వచ్చా?'' అడిగేడు నారాయణ బాబు వచ్చినట్లు తలూపేడు ప్రకాశం.

"అయితే ఆ అల్మారాలో పైనించి మూడో వరుసలోకి ఆరో కేసెట్ అందుకో'' అన్నాడు.

అతను చెప్పినట్లే ఆ కేసెట్ తెచ్చి అందించేడు.

"అది ఆయనగారి కథ అన్నాడు కదూ... అది అతనిది కాదు. అలాంటి 'జడ్జిమొగుడు' కథ నాదీ కాదు... ఆరెండింటికీ మూల కథ ఇదిగో ఇందులో ఉంది... సినిమా చూస్తావా?'' అన్నాడు నారాయణ బాబు.

బిత్తరబోయేడు ప్రకాశం. లైట్ బాయ్‌గా వచ్చిన తను తన మంచితనం వల్ల అసోసియేట్ డైరక్టరు దాకా ఎదిగి గొర్రెతోక లాంటి సంపాదనతో ఉండిపోతే... తనముందే అటు దండాల సామీ ఇటు నారాయణ బాబూ ఎలా పోటాపోటీగా ఎదిగిపోయేరో కాస్త అర్థమైంది ప్రకాశానికి.

"వద్దులెండి'' అన్నాడు వినయంగానే...

"మరి ఈ విషయం ఆయనగారితో చెప్పు దొంగకేనా నీతి ఉంటుంది కావీ...''

నారాయణ బాబు ఇంకా ఏదో అంటున్నారు... ప్రకాశం లేచి గుమ్మం దాటేశాడు. □□